క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతకొమ్మదిన్నె : మండలంలోని 132 కేవీ మూలవంక కస్టర్ స్టేషన్లో వివిధ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కడప రూరల్ సబ్ డివిజనల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.కృష్ణదేవ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని మూలవంక, చిన్నకాంపల్లి, నాగిరెడ్డిపల్లి, రిమ్స్, ఐటీ పార్కు, గొర్లపల్లి, దర్బార్‌పేట, తెలుగుగంగ కాలనీలతోపాటు కృష్ణాపురం సబ్ స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

చంద్రప్రభ వాహనంపై శ్రీరంగనాథుడు



చంద్రప్రభ వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటిలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలుపూజ పవిత్రోత్సవాల్లో భాగంగా ఐదవరోజు గురువారం శ్రీరంగనాథుడు చంద్రప్రభ వాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. నూలుపూజ పవిత్రోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. 9 రోజుల పాటు నిర్వహించే నూలుపూజలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించి తరించారు. ఈఓ కేవీ రమణ పర్యవేక్షించారు.

గంగమ్మతల్లికి పట్టు వస్త్రాలు అందజేత

చింతకొమ్మదిన్నె : బుగ్గలేటిపల్లి సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో గురువారం కమలాపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ పోచంరెడ్డి నరేన్ రామానుజులరెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది అమ్మవారికి పట్టు వస్త్రాలను అందజేసి అమ్మవారి ఆశీస్సులను తీసుకోవడం మా కుటుంబానికి ఆనవాయితీగా వస్తోందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిబ్బందికి ఘనంగా వీడ్కోలు



సిబ్బందిని సత్కరించిన సీఐ, ఎస్‌ఐ

ముద్దనూరు : స్థానిక అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌లో బదిలీ అయిన పోలీసు సిబ్బందికి గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. సీఐ దస్తగిరి, ఎస్‌ఐ మైనుద్దీన్, ఏఎస్‌ఐ శ్రీనివాసులు బదిలీపై వెళ్తున్న ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ళను ఘనంగా సత్కరించారు. 5 సంవత్సరాలుగా స్థానిక పోలీసుస్టేషన్‌లో సేవలందించిన సిబ్బందిని సీఐ, ఎస్‌ఐలు అభినందించారు.

అన్నక్యాంటీన్లను వెంటనే ప్రారంభించాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో పూర్తయిన 4 అన్న క్యాంటీన్లను వెంటనే ప్రారంభించాలని కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి కోరారు. గురువారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్‌ను ఆయన సందర్శించారు. అక్కడున్న రోజువారీ కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నరేన్ మాట్లాడుతూ రెండో దశలో సెప్టెంబర్ 5న అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని ప్రభుత్వం చెప్పిందని, ఇంత వరకూ వాటిని ప్రారంభించలేదన్నారు. కమలాపురం, చెన్నూరులలో కూడా అన్నక్యాంటీన్లను ప్రారంభించాలని కోరారు. అలాగే గతంలో మొదట వచ్చిన 250 మందికే భోజనం అందించేవారని, ఇప్పుడు ఆ సంఖ్యను పెంచాల్సిన అవసరముందన్నారు. విజయవాడలో వరదలు వచ్చాయనే కారణం చూపి రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. సూపర్ సిక్స్ హామీల సంగతే మరచిపోయారన్నారు. తల్లికి వందనం పథకాన్ని వచ్చే ఏడాదికి వాయిదా వేశారని, ఖరీఫ్ సీజన్ కూడా పూర్తి కావచ్చిందని, రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం కూడా అందించలేదన్నారు. ఏమీ చేయకపోయినా మూడు నెలల్లోనే రూ.19వేలకోట్లు అప్పులు చేశారన్నారు. గత ప్రభుత్వం కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలను అందించిందని, ఈ ప్రభుత్వం ఏదో ఒక కారణం చూపి పథకాల అమలును వాయిదా వేయాలని చూస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా సంక్షేమ పథకాల అమలులో శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.సుబ్బరాయుడు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రేషన్ కోసం బారులు ...



రేషన్ కోసం షాపు వద్ద నిలబడి ఉన్న మహిళలు (ఇన్‌సెట్) యర్రగుంట్లలో రేషన్ కోసం క్యూలైన్‌లో రేషన్ కార్డులు ఉంచిన మహిళలు

పట్టణ పరిధిలోని శాంతినగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ చౌక దుకాణం వద్ద రేషన్ కోసం లబ్ధిదారులు బారులు తీరారు. గత ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఇంటింటికి రేషన్ అందేది. అయితే ప్రస్తుతం మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. ఇప్పుడు పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో ఈనెల ఇంటింటికి రేషన్ బండి రాలేదు. దీంతో శాంతినగర్ కాలనీలోని రేషన్ షాపు వద్ద రేషన్ కోసం మహిళలు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. రేషన్ కార్డులు క్యూలైన్‌లో పెట్టి నిలబడి ఉన్నారు. ఇది చూస్తే 2014–19 కాలంలో ఇలానే రేషన్ కోసం లబ్ధిదారులు నానా కష్టాలు పడ్డారు. తర్వాత 2019–2024 వరకు ఉన్న ప్రభుత్వం హయంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ అందే విధంగా ఏర్పాటు జరిగింది. ఇప్పుడు పాత పద్ధతిలోని లబ్ధిదారులు రేషన్‌కార్డులు తీసుకుని షాపుల వద్ద గంటల కొద్ది నిలబడాల్సిన దుస్థితి వచ్చింది. – ఎర్రగుంట్ల

మైలవరం కాలువ మురికి మయం



వ్యర్థపదార్థాలతో నిండి మురికి కాలువగా మారిన మైలవరం దక్షిణ కాలువ

మైలవరం దక్షిణ కాలువ వ్యర్థ పదార్థాలతో నిండి మురికి కాలువను తలపిస్తోంది. కలమల్ల గ్రామం సమీపంలో మైలవరం దక్షిణ కాలువ వెంబడి ఆక్రమించుకుని దుకాణాలు పెట్టుకున్నారు. కాలువను అక్రమించుకోవడమే కాకుండా వాటిని అగ్రిమెంట్ల రూపంలో తమ సొంత స్థలమంటు అమ్మకాలు కూడా చేసుకున్నారు. గతంలో వీటిపై మైలవరం ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. అయిన ఫలితం లేదు. ఈదుకాణాదారులు ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను కాలువలో వేస్తున్నారు. దీంతో కాలువ అంతా వ్యర్థ పదార్థాలతో నిండి మురికి కాలువగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం మైలవరం డ్యాంకు వరద నిరు వస్తుండటంతో డ్యాం నీటిని పెన్నానదిలోకి కాలువల్లోకి వదులుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – ఎర్రగుంట్ల

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు

కమలాపురం : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మరణం తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కామనూరు శ్రీనివాసులు తెలిపారు. గురువారం కమలాపురం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్ట్ ఉద్యమానికే కాకుండా భారత దేశంలోని లౌకిక ప్రజా స్వామ్య పురోగమనాలకు కూడా తీరనిలోటన్నారు. ఎమర్జెన్సీ భయాందోళనలను నిర్భయంగా ఎదుర్కొన్న విప్లవ విద్యార్థి నుంచి దేశమంతటా గౌరవించే ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకుడి వరకు కామ్రేడ్ ఏచూరి జీవితం భారత రాజకీయాల్లో ప్రకాశవంతమైన అధ్యాయాలలో ఒకటన్నారు. కామ్రేడ్, ఆర్గనైజర్, సోషలిస్ట్, పొలిటీషియన్ లాంటి బహుముఖ బాధ్యతలన్నింటిని అద్భుతంగా నిర్వహించారని గుర్తు చేశారు. రైతులు, ప్రజల విముక్తి కోసం తన రాజకీయ జీవితాన్ని త్యాగం చేసిన ఆయన సంఘ్ పరివార్, మతతత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరులో సవాళ్లను ధీటుగా ఎదుర్కొన్నాడని కొనియాడారు. అనేక దశలలో జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసి రాజకీయ ఎత్తుగడలను రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించాడన్నారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి సీపీఎంకు ఎప్పటికీ పూడ్చలేని లోటు అన్నారు.

జమ్మలమడుగు రూరల్ : సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మరణం సీపీఎం పార్టీకి తీరని లోటు అని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సీతారాం ఏచూరి మరణం రైతుల, ప్రజల సమస్యల కోసం నిరంతరం తన గళాన్ని పార్లమెంట్‌లో వినిపించారన్నారు. కడప ఉక్కు కోసం జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని లేవనెత్తారన్నారు.

కనుమరుగైన ఉట్లు



ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఏ ఇంటిలో చూసినా ఉట్లు కనిపించేవి. ఇళ్లలోకి ఎవరు వచ్చినా దంతెలకు వేలాడుతూ దర్శనమిచ్చే ఉట్లు రాను రాను కనుమరుగయ్యాయి. సుమారు 20 సంవత్సరాల క్రితం పిల్లులకు అందకుండా పాలు, పెరుగును ఉట్లలో ఉంచి భద్రపరిచేవారు. ప్రస్తుత కంప్యూటర్ కాలంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా కనిపించడం లేదు. ఇప్పుడు చదివే విద్యార్థులకు ఉట్టి అంటే అదేమిటంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. – పులివెందుల రూరల్

బదిలీలు సర్వసాధారణం



బదిలీపై వెళ్తున్న ఏఎస్‌ఐ, కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న డీఎస్పీ, సీఐలు

పులివెందుల రూరల్ : ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి బదిలీలు సర్వసాధారణమని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐలు రామచంద్ర, హనీఫ్‌ఖాన్, హెడ్ కానిస్టేబుళ్లు కొండారెడ్డి, గోవిందులతో పాటు కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న సురేష్, నరసింహ, శ్రీకాంత్, మునిరెడ్డిలు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న వీరిని గురువారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ మురళీనాయక్, సీఐ జీవన్ గంగనాథ్‌బాబు, ఎస్‌ఐ నారాయణలు పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. అయినా ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి బదిలీలు తప్పవన్నారు. ఎక్కడికి వెళ్లినా విధులను సమర్థవంతంగా నిర్వహించాలని వారు సూచించారు.

కుక్కలు పట్టివేత



కుక్కలను పట్టుకుంటున్న ప్రత్యేక బృందం

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలో గురువారం మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదేశాల మేరకు కుక్కలను పట్టే ప్రత్యేక బృందాలు పట్టణంలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తున్న కుక్కలను పట్టుకున్నారు. వాటిని ప్రత్యేక వాహనంలో అటవీ ప్రాంతాలకు తరలించారు. వర్షాకాలం కావడంతో కుక్కల ద్వారా వ్యాపించే యాంటీ ర్యాబిష్ వ్యాధి భారిన పడకుండా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.

సస్యరక్షణ చర్యలు పాటించండి



గంగవరంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : వరి పంటలో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని గంగవరం గ్రామంలో సాగు చేసిన వరి పంటను ఆయన పరిశీలించి ఆకు ముడత, కాండం తొలుచు పురుగు ఉన్నట్లు గుర్తించారు. దీని నివారణకు పైరు నాటి నెల రోజుల లోపు ఉంటే 2 గ్రాముల కార్టాప్ హైడ్రో క్లోరైడ్‌ను లీటర్ నీటిలో కలిపి మొదళ్ల తడిచే విధంగా పిచికారి చేయాలన్నారు. నెల రోజుల పైన ఉండే పంట అయితే 0.2 మి.లీ. ఫ్లూబెండమైడ్ లీటర్ నీటిలో కలిపి లేదా 0.3 మి.లీ. క్లోరంట్రానిలిప్రోల్ (కోరాజన్) లీటర్ నీటికి కలిపి మొదళ్ల తడిచే విధంగా పిచికారి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, వీఏఏ వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ అమరేంద్రకు సన్మానం



రిజిస్ట్రార్ అమరేంద్రను సన్మానిస్తున్న సీఐటీయూ జిల్లా సభ్యుడు, తదితరులు

వేంపల్లె : ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సండ్రను సీఐటీయూ జిల్లా సభ్యుడు పాములూరు రామసుబ్బారెడ్డి ఘనంగా సన్మానించారు. గురువారం ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో అధ్యాపక బృందం, సహ ఉద్యోగులు సత్కరించారు. అనంతరం అభినందనలు తెలియజేశారు.

తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండల పరిధిలోని గోపవరం, శివాలపల్లి దళితవాడల్లో పది రోజులుగా తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని అక్కడి ప్రజలు వాపోతున్నారు. గురువారం గ్రామ ప్రజలు విలేకరులతో మాట్లాడుతూ రెండు గ్రామాల్లో దాదాపు 180 కుటుంబాలు ఉన్నాయన్నారు. పది రోజులుగా గ్రామానికి సక్రమంగా తాగునీరు సరఫరా చేయడం లేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. చుట్టూ నీరు ఉన్నా తాగడానికి నీరు లేక కిలో మీటర్ దూరంలో ఉన్న కాశీ విశ్వనాథస్వామి గుడి వద్దకు వెళ్లి ద్విచక్ర వాహనాల్లో తెచ్చుకుంటున్నామని తెలిపారు. నెలకు కనీసం రెండుసార్లు నీటి సమస్య వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు గ్రామాల్లో దాదాపు 400 పాడి పశువుల ఉన్నాయని పశువులకు నిటీని బయట నుంచి తెచ్చుకుంటునామన్నారు.

సంబంధిత అధికారులు తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలని రెండు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్‌కుమార్‌ను సంప్రదించగా తాగునిటీ సమస్య తన దృష్టికి రాలేదన్నారు. తాగునీటి సమస్యపై చర్యలు తీసుకుంటామన్నారు.

క్షేత్ర పర్యటన

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు క్షేత్రపర్యటనలో భాగంగా నగరంలోని అల్మాస్‌పేటలో ఉన్న ప్రధానమంత్రి కౌశల్ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాల కార్యక్రమం గురించి తెలుసుకున్నారు. కళాశాల అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి. విజయలక్ష్మి, డా. ఎం. గురుమోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నాగవేణిల ఆధ్వర్యంలో విద్యార్థినుల బృందం పలు అంశాలను అధ్యయనం చేసింది. బుట్టల అల్లికలు, కుట్టుమిషన్, గార్లాండ్ మేకింగ్ తదితర అంశాలపై ఇస్తున్న శిక్షణను ప్రత్యక్షంగా పరిశీలించారు.

డీఎంహెచ్‌ఓకు వైద్యుల వినతి

కడప రూరల్ : జీఓ నెంబరు 85కు వ్యతిరేకంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా గురువారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.నాగరాజుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం సభ్యులు మాట్లాడుతూ ఈ జీఓ ద్వారా తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు. దీంతో తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జీఓ వల్ల పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం



ముద్దనూరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



జమ్మలమడుగులో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెలుతున్న భక్తులు



ఎర్రగుంట్లలో లడ్డుతో ఊరేగింపు చేస్తున్న వినాయకుడి ఉత్సవ కమిటీ నిర్వాహకులు

జమ్మలమడుగు రూరల్ : వినాయకుడి విగ్రహాలను నిమజ్జనానికి భక్తులు గురువారం ఘనంగా తరలించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.

ముద్దనూరు : మండపాల్లో కొలువుదీరి పూజలందుకున్న విగ్రహాలు భక్తుల కోలాహలం మధ్య, మేళతాళాలతో ఊరేగింపుగా నిమజ్జనానికి బయలుదేరాయి. వినాయక మండపాల వద్ద భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రశాంతంగా వేడుకలు ముగిసాయి.

ఎర్రగుంట్ల : పట్టణంలోని నడివూరులో వినాయకుడి నిమజ్జనం సందర్భంగా గురువారం వినాయకుడి లడ్డును లక్కీ డ్రిప్ తీశారు. అందులో మాజీ కౌన్సిలర్ పార్వతమ్మ, వీరప్రతాప్‌రెడ్డి(కత్తి) దంపతులు లక్కీ డ్రిప్‌లో సొంతం చేసుకున్నారు. మేళతాళాలతో వినాయకుడి లడ్డును ఊరేగింపుతో ఇంటికి తరలించారు. మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్‌రెడ్డి వినాయకుడి నిమజ్జనం పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ యోగాంజనేయులు

వేంపల్లె : మాదకద్రవ్య రహిత సమాజం దేశ ఔన్నత్యానికి ప్రతీక లాంటిదని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. గురువారం కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, విభిన్న స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో మాదకద్రవ్యాల నిర్మూలన వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వచ్ఛంద సేవసంస్థల నియోజకవర్గ కన్వీనర్లు మాట్లాడుతూ మత్తు పానీయాలు, మాదకద్రవ్యాలుగా ఎంచబడుతున్న గంజాయి, కొకైన్‌ల వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించి విద్యార్థులలో నూతన ఆలోచన రేకెత్తించారు. విభిన్న ఉదాహరణలు ద్వారా విద్యార్థులను మత్తు పదార్థాల నుంచి విముక్తులు కావాలని రహదారుల వెంట ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల కూడలిలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఓబుల్‌రెడ్డి, ఎన్జీవో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆవుల పాపం పంచాయతీ అధికారులదే



మృతిచెందిన ఆవుకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : స్థానిక పంచాయతీ పరిధిలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు తిని ఆవులు మరణిస్తున్నాయని... ఈ పాపం కేవలం గ్రామ పంచాయతీ అధికారులదేనని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆరోపించారు. గురువారం రాఘవేంద్ర పాఠశాల వీధిలో ప్లాస్టిక్ వ్యర్థాలు తిని మరణించిన ఆవును గుర్తించి హిందూ ఐక్యవేదిక, గోసంరక్షణ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌లో ఆవు కళేబరాన్ని తీసుకువెళ్లి పాపాగ్ని నదిలో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేంపల్లి ప్రాంతంలో దాదాపు వంద ఆవులు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను, వాహనదారులను ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. గతంలో కొందరు స్థానికులను పొడిచి గాయలపాలు చేశాయన్నారు. ఈ ఆవులు పట్టణంలో తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు తిని ప్రాణాలు కోల్పోయాయన్నారు. వీటి వల్ల ప్రజలకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయంగా ఉందని.. వాటిని గోశాలకు తరలించమని అనేకమార్లు పంచాయతీ ఈఓకు వినతిపత్రాలు అందించినా అవి బుట్టదాకలు అయ్యాయన్నారు. ఈ ఆవుల మరణం పాపం ఈఓదే అన్నారు. ప్రజలవద్ద నుంచి ముక్కు పిండి పన్నులు వసూలు చేయడం, తమ స్వంత ఆదాయాన్ని పెంచకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యల పరిస్కారంపై లేదనిన్నారు. కార్యక్రమంలో బీజేపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, గో సంరక్షణ సమితి సభ్యులు పుల్లగూర గోవర్ధన్, జూటూరు సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న మధుసూదన్

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ సేవా సమితి వలంటీర్లకు అవగాహన సదస్సును నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. గురువారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో జాతీయ సేవా సమితి యొక్క ఉద్దేశం, దిశ నిర్దేశం విద్యార్థులకు బోధించి విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలతో ఎలా మెలగాలో, వారి సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కారం ఎలా చూపాలో కోఆర్డినేటర్ మధుసూదన్ వివరించారు. ఈ సదస్సులో ప్రోగ్రాం ఆఫీసర్ విశ్వనాథరెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్, అశ్విని, కళాశాల ఫ్యాకల్టీ, జాతీయ సేవాసమితి సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు స్టడీచైర్లను అందజేసిన చంద్రమౌళేశ్వరరెడ్డి

సింహాద్రిపురం : కోరగుంటపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వపు విద్యార్థి కీ.శే.డాక్టర్ లక్ష్మణస్వామిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గంగవరం పాఠశాల విద్యార్థులకు స్టడీ చైర్లను వితరణగా అందజేశారు. అలాగే పాఠశాల ఆవరణలో 110 మొక్కలు నాటి డ్రిప్పు పరికరాలు, పైపులైన్లు ఏర్పాటు చేశారు. సుమారు రూ.1.25 లక్షలు వెచ్చించి పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. సావిత్రి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో చిరంజీవిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మిరమణమ్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

భాగవతులకు పింఛన్ సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న రాయలసీమ భక్త సమాజం మీడియా సమన్వయకర్త బాలకృష్ణారెడ్డి

సింహాద్రిపురం : రాయలసీమ ప్రాంతంలో ఆధ్యాత్మిక ప్రవచనాలను బోధిస్తున్న భాగవతులను గుర్తించి వారికి సామాజిక భద్రతా పథకం కింద పింఛన్ అందజేయాలని రాయలసీమ భక్త సమాజం మీడియా సమన్వయకర్త బాలకృష్ణారెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ పరిధిలో మొత్తం 20 భక్త సమాజములు ఉన్నాయన్నారు. ఇందులో 5000 మంది భాగవతులు ఆధ్యాత్మిక ప్రవచనాలను వల్లిస్తున్నారన్నారు. రామాయణం, భాగవతం పఠనం చేయడం వీరి నిత్యకృత్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని, వారిని భక్తి మార్గంలో చైతన్యం నింపేందుకు కృషి చేస్తుంటారని తెలిపారు. నేటి నాగరిక సమాజంలో హిందూ సంస్కృతి సాంప్రదాయాలు సన్నగిల్లకుండా భాగవతం రామాయణం పఠనం ద్వారా అందరిని చైతన్య పరచడం భాగవతుల ప్రధాన లక్ష్యమన్నారు. సమాజ హితం కోసం కృషి చేస్తున్న భాగవతులకు కళాకారుల కింద పింఛన్ అందజేస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ దిశగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంఘాలు, మేధావులు, సామాజిక విశ్లేషకులు చొరవ చూపాలని ఆయన కోరారు. అలాగే ప్రభుత్వం కూడా స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

స్పష్టమైన వైఖరితో కెరీర్‌కు బాటలు వేసుకోవాలి

వైవీయూ: మనం ఎంపిక చేసుకున్న లక్ష్యాలపై స్పష్టమైన వైఖరితో కెరీర్‌కు బాటలు వేసుకోవాలని స్టైప్ సీఈఓ సి. సాయిగ్రేస్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో స్టైప్ ఆధ్వర్యంలో "కెరీర్ కౌన్సిలింగ్"పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ కోర్సుల ఎంపిక ఇష్టం మేరకే చేసుకోవాలే తప్ప ఒత్తిడితోనో, ఎవరికోసమో చేసుకోకూడదన్నారు. న్యాయమూర్తి శంకర్ మాట్లాడుతూ కౌన్సిలింగ్ అనేది సరైన మార్గాన్ని కనుగొనడంలో సహాయపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ కెరీర్ కౌన్సిలింగ్‌ను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.